
టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో..


కొండాపూర్‌లో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ


ప్రశాంత్‌నగర్ కాలనీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో..


శేరిలింగంపల్లిలో..


హుడా ట్రేడ్ సెంటర్ రామాలయంలో..


భెల్ ఎంఐజీ కాలనీలోని ఆలయంలో..

కమనీయం.. సీతారాముల కల్యాణం


మాదాపూర్ అన్నమయ్యపురంలో..


మియాపూర్.. బికె ఎన్‌క్లేవ్, శ్రీవెంకటేశ్వర ఆలయంలో శ్రీరామ నవమి

వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

- 'జై శ్రీరామ్' నినాదాలతో మారుమోగిన కాలనీలు, బస్తీలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- పలు ప్రాంతాల్లో పల్లకీసేవలు, శోభాయాత్రలు
- రాజకీయాలకు అతీతంగా నేతలు, స్థానికులు హాజరు

శేరిలింగంపల్లి జోన్ బృందం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. పలు కాలనీలు, బస్తీల్లోని ఆలయాలు, కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో అర్చకులు నిర్వహించారు. కన్నులారా వీక్షించి భక్తులు తరించారు. వాడవాడలా జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తుల 'జై శ్రీరామ్....జైజై శ్రీరామ్' నినాదాలతో ఆయా ప్రాంతాలు మారుమోగాయి.

- ఉదయం నుంచి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలోని కాలనీలు,బస్తీలలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కూడళ్లతో పాటు ఆలయాల్లో అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు.
- రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, వివిధ సంఘాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రతినిధులు, ఆలయ కమిటీలు, కాలనీ,బస్తీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- పలు చోట్ల కాలనీలు,బస్తీలలో సీతారాముల విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పల్లకిసేవలు, శోభాయాత్రలను నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు చేశారు.

శేరిలింగంపల్లి జోన్ బృందం:


లక్ష్మీవిహార్ ఫేజ్-2 గేటెడ్ కమ్యూనిటీలో..


గోపన్‌పల్లిలో..


ఖాజాగూడలో..


నల్లగండ్ల అపర్ణాగ్రాండేలో..

ఐటీలో ఆన్‌లైన్ ఎంఎస్ డిగ్రీ కోర్సు

- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ కోర్సెరాలో ఈ కొత్త కోర్సు
- జూలై 22 నుంచి ప్రారంభించాలని నిర్ణయం

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ప్రపంచంలోని ప్రముఖ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన కోర్సెరాలో ఆన్‌లైన్ 'మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' (ఈఎంఎస్‌ఐటీ)కోర్సును ప్రారంభించనుంది. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ భారతదేశపు మొట్టమొదటి ట్రిపుల్ ఐటీ, పరిశోధన, నేతృత్వంలో మంచి ఆదరణ పొందింది. ఈఎంఎస్‌ఐటీ కోర్సెరాలో అందించే భారతీయ విశ్వవిద్యాలయం నుంచి మొదటి మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇది పరిశ్రమ మైక్రో-క్రెడెన్షియల్‌లను ఏకీకృతం చేస్తుంది. విద్యార్థులు ముందస్తు అభ్యాసం ఆధారంగా వారి అభ్యాస ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మార్గాలను సృష్టిస్తుంది. నాస్కామ్ ప్రకారం భారతీయ ఐటీ పరిశ్రమకు 2026 నాటికి దాదాపు 95 లక్షల మంది టెక్ నిపుణుల అవసరం ఉందని అంచనా. ఈఎంఎస్‌ఐటీ ప్రోగ్రామ్‌లో గ్రాడ్యుయేట్లు ఈ కోర్సుతోనే కంప్యూటర్ సైన్స్, ఫైనాన్స్, హెల్త్ కేర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి పరిశ్రమల్లో ఐటీ ఉద్యోగాల కోసం సిద్ధంగా ఉంటారు. ఎంఎస్‌ఐటీ విస్తారమైన మూడు వేలమంది పూర్వ విద్యార్థులతో ఆన్‌లైన్ జాబ్ బోర్డులు, నెట్‌వర్కింగ్ అవకాశాలకు విద్యార్థులు యాక్సెస్‌ను కలిగి ఉంటారు. 2024 స్ప్రింగ్ కో హార్ట్ 22 జూలై 2024న ప్రారంభించాలని భావిస్తున్నారు.

- ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో భాగస్వామ్యం కావడం మాకు గౌరవంగా ఉందని కోర్సెరా ఇండియా, ఆసియా పసిఫిక్ మేనేజింగ్ డైరెక్టర్ రాఘవ్‌గుప్తా అన్నారు. పాఠ్యప్రణాళికలో హ్యాండ్ ఆన్ ప్రాజెక్టులు, డేటాసైన్స్‌లో స్పెషలైజేషన్లు, పూర్తి స్టాక్ డెవలప్‌మెంట్, మెషిన్ లెర్నింగ్, చాట్ జీపీటీ కోపైలెట్ వంటి ఏఐ సాధనాల పట్ల అవగాహన కల్పిస్తుందన్నారు.

కొత్తతరానికి ఎంతో ఉపయోగకరం..

ఎంఎస్‌ఐటీ వినూత్నమైన ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్ అనుభవానికి ప్రాప్యతను విస్తరించడానికి మేము సంతోషిస్తున్నాం. ఫ్రేమ్ వర్క్ కొత్త తరాల విద్యార్థులు తమ కెరీర్‌లను ఐటీ, కంప్యూటర్ సైన్స్‌లో విజయవంతంగా ప్రారంభించేందుకు సహాయపడుతుంది.

– ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్

ట్రిపుల్‌ఐటీతో భాగస్వామ్యం కావడం ఎంతో గౌరవం..

భారతదేశం, వెలుపల ఉన్న అభ్యాసకులకు విశ్వవిద్యాలయం ప్రసిద్ధి చెందిన నాణ్యత, సరసమైన విద్య ప్రయోజనాలను తీసుకురావడమే లక్ష్యం.

– కోర్సెరా, ఆసియా పసిఫిక్ మేనేజింగ్ డైరెక్టర్ రాఘవ్‌గుప్తా


డంపింగ్ యార్డు కాదు..రోడ్డే..

- రోడ్ల మూసివేతతో ఇక్కట్లు
- నిర్మాణ సామగ్రితో రోడ్డు బ్లాక్
- మూడు రోజులుగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది
- పట్టించుకోని శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు


శిల్పా గార్డెన్స్‌లో నిర్మాణ సామగ్రితో రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం

గచ్చిబౌలి: భవన నిర్మాణ సామగ్రి అడ్డుగా వేసి రోడ్డును మూసివేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్-20లో పెద్ద సంఖ్యలో భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కొందరు బిల్డర్లు, యజమానులు రోడ్లపైనే నిర్మాణ సామగ్రి వేసి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కల్గిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో కొందరు రహదారులను డంపింగ్ యార్డులుగా వాడుకుంటున్నారు. దీంతో ఆయా కాలనీల వాసులు వాహనాల్లో బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండాపూర్‌లో లింకు రోడ్డును ఆనుకొని ఉన్న శిల్పాగార్డెన్స్‌లో రోడ్డుకు ఇరువైపుల బిల్డర్లు నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణ సామగ్రితో రోడ్డును బ్లాక్ చేసి మూడు రోజులుగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్టీల్, సిమెంట్, ఇసుక, కంకర, ఇటాచీలు, కాంక్రీట్‌మిల్లర్, ట్రాక్టర్‌తో రోడ్డును పూర్తిగా మూసి వేశారు. దీంతో కాలనీ వాసులు చేసేదేమి లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. రోడ్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం



సాక్షి,సిటీబ్యూరో: శ్రీ రామ నవమిని పుర్కరించుకుని బుధవారం నలగండ్ల హుడా కాలనీలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా సీతా రామ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కల్యాణ వేడుక అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాలనీ వాసుల తో పాటు చుట్టుపక్కల కాలనీ వాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం సీతారామస్వామి విగ్రహాలను ఊరేగించారు కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు విజయేందర్, కరుణాకర్, మధుసూదన్ రావు, శ్రీధర్, విజయ్, సుబ్బరాజు, నాగేష్, రమణ, విజయ్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు...

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 50, దొండ 35, దోస 30, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (3)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

అలరించిన రామాయణం నృత్యరూపకం



మాదాపూర్: కళాకారులు రామాయణం నృత్య రూపకాన్ని ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధామోహన్ శిష్య బృందం నృత్య రూపకాన్ని ప్రదర్శించి అలరించారు. సీతారాముల జననం, విశ్వామిత్రునితో కలిసి అడవికి వెళ్లడం, స్వయంవరం, శివధనుస్సు, అడవికి వెళ్లడం, సీతాదేవి అపహరణ, రామవారధి లంకాదహనం, రావణాసుర వధ, సీత అగ్నిప్రవేశం, సీతారాముల పట్టాభిషేకం తదితర అంశాలను కళాకారులు అముక్త, మాన్సి, రిషిత, శాన్వి, హిరణ్మయి, చైత్ర, సహస్ర తదితరులు ప్రదర్శించారు.

వసతులు లేక అవస్థలు


గంగారంలోని శ్మశానవాటిక


నిరుపయోగంగా ఉన్న చేతి పంపు

- గంగారం శ్మశానవాటికలో కనీస సౌకర్యాలు కరువు
- స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

హఫీజ్‌పేట్ : చందానగర్ గంగారం గ్రామ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. మహాప్రస్థానంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కనీస సౌకర్యాలు లేక శ్మశానవాటికకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చేపట్టాల్సిన వసతులు ఇవీ

- స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించాలి

కుళాయిలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- శ్మశానవాటికలో చెత్త చెదారం వేయకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.
- శ్మశాన వాటి చుట్టూ వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.


శ్మశానవాటికలో చెత్తా చెదారం

- ప్రహరీని ఆనుకొని వెలసిన చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించాలి
- హస్తికలు భద్రపరిచేందుకు ప్రత్యేక గదిని నిర్మించాలి.

నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి



గంగారం శ్మశాన వాటికలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి ఉన్నతాధికారులు ప్రత్యేక నిధులు కేటాయించాలి.

– తిమ్మారెడ్డి, చందానగర్

పరిశుభ్రతను కాపాడాలి



శ్మశాన వాటికలో స్థానికులు చెత్త చెదారం వేస్తున్నారు. ప్రధాన ద్వారం ముందు చిరు వ్యాపారుల దుకాణాల ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్మశాన వాటికలో నిరుపయోగంగా చేతి పంపునకు మరమ్మతులు చేయాలి.

– వెంకటేష్, గంగారం

19న వనం సుధాకర్ నామినేషన్


మాట్లాడుతున్న మైదంశెట్టి రమేష్

మియాపూర్ : ఈ నెల 19న ఎంసీపీఐయూ అభ్యర్థి కామ్రేడ్ వనం సుధాకర్ నామిషన్ దాఖలు చేస్తున్నట్లు ఎంసీపీఐయూ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీఎల్ఎఫ్ బలపర్చిన ఎంసీపీఐయూ అభ్యర్థి కామ్రేడ్ వనం సుధాకర్ 19న చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగ ఉనికికే ప్రమాదం అన్నారు.

తల్లిదండ్రులకు చెంతకు తప్పిపోయిన బాలిక



బాలికను తండ్రికి అప్పగించిన మాదాపూర్ పోలీసులు

మాదాపూర్: తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాదాపూర్ జూబ్లిరిడ్జ్ హోటల్‌వద్ద అక్షిత (4) అనే బాలిక తప్పిపోయి ఏడుస్తుండగా ఓ వ్యక్తి చేరదీసి మాదాపూర్ పోలీసులకు అప్పగించారు. బాలిక వద్ద వివరాలను అడిగి తెలుసుకున్న పోలీసులు తల్లిదండ్రులను స్టేషన్‌కు రప్పించి చిన్నారిని వారికి అప్పగించారు.

జనహితం కోసం హోమం


హోమం నిర్వహిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఆధ్వర్యంలో చిట్కూల్‌లో శ్రీరామనవమి సందర్భంగా వసంత నవరాత్రుల పూర్ణాహుతి హోమాన్ని జరిపించారు. నీలం సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. సకల జనులు సుభిక్షంగా ఉండాలని యజ్ఞం జరిపించినట్లు ఆయన పేర్కొన్నారు. పదకొండు రోజులుగా జరుగుతున్న ఈ మహా యజ్ఞం బుధవారం లక్ష పుష్పార్చనతో ముగిసింది.

29 నుంచి గీతా సమ్మర్ క్యాంప్

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు గీతా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస్ బుధవారం ఓ ప్రకటనలతో తెలిపారు. డిఆర్‌యస్ ఇంటర్నేషనల్ స్కూలులో ఈనెల 29 నుంచి మే 10వ తేదీ వరకు గీతా సమ్మర్ క్యాంపు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. భగవద్గీత పారాయణం, ఉపోద్ఘాతం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సింగింగ్, స్కేటింగ్, స్విమ్మింగ్, గేమ్స్, డ్రామా, దేశభక్తి కథలు, శ్లోకాలు వంటి వాటిలో తర్ఫీదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన కార్యక్మం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు బహుమతులు, ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440486792లో సంప్రదించాలని కోరారు.

దేశాన్ని కాపాడే మోదీనే గెలిపిద్దాం



ఆంజనేయనగర్‌లో ప్రచారం చేస్తున్న వద్దేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీనగర్ డివిజన్‌లోని ఆంజనేయనగర్‌లో 'ఘర్ ఘర్ పే భాజాపా'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. దేశాన్ని కాపాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీనే మళ్లీ గెలిపిద్దామని ఓటర్లను అభ్యర్థించారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ బలంగా ఉందన్నారు.

కేపీహెచ్‌బీకాలనీ డివిజన్ బీజేపీ కన్వీనర్‌గా గురుప్రసాద్


గురుప్రసాద్‌ను అభినందిస్తున్న, బీజేపీ సీనియర్ నాయకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ బీజేపీ కన్వీనర్‌గా నియమితులైన గురుప్రసాద్‌ను బుధవారం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గురప్రసాద్ మాట్లాడుతూ... కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా కోకన్వీనర్ పద్మయ్య, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు సూర్యప్రకాష్, పాపయ్యగౌడ్, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.